సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



నేటినుంచి ఉత్సవాలు

మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



నేల ఆరోగ్యం కోసం..

నేల సంరక్షణకు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని శాస్త్రవేత్తలు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /12.6

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కొనగట్‌పల్లిలో అభివృద్ధి పనులు భేష్



హన్వాడ: మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలోని ఉద్యోగులతో మాట్లాడి సమస్యలు ఇతరత్రా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం పొందిన కొనగట్‌పల్లిని సందర్శించి గ్రామంలోని నర్సరీని, పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సర్పంచ్ మానసను అభినందించారు. ఆయన వెంట ఎంపీపీ బాలరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు విజయనిర్మల, ఎంపీడీఓ ధనంజయగౌడ్, ఎంపీఓ వెంకట్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వేణాచారి తదితరులున్నారు.

మరో 3నెలలు పొడిగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆహార భద్రత కార్డు లబ్ధిదారుల కోసం ఆధార్ అథెన్టిసిటీ చేసుకునే గడువు మరో మూడు నెలలు పొడిగించినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకున్న ఈ గడువును 2024 మార్చి 31వ తేదీ వరకు పొడిగించామని పేర్కొన్నారు.

24 నుంచి తరగతులు ప్రారంభం

మహబూనగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ, డిగ్రీ తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులకు వచ్చే విద్యార్థులు ఫీజుల రశీదులతో హాజరై, యూనివర్సిటీ నుంచి వచ్చిన పుస్తకాలు తీసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం.73829 29609ను సంప్రదించాలని ఆయన సూచించారు.

24న క్రైస్తవులకు దుస్తుల పంపిణీ



స్టేషన్ మహబూబ్‌నగర్: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచే క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని హైతి పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని క్రిస్టియన్ ఫ్రంట్ అధ్యక్షుడు దాసరి సుందర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంబీసీ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాయని చెప్పారు. ఈ నెల 24న మధ్యాహ్నం 12 గంటలకు ఎంబీసీ మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిరుపేద క్రైస్తవులకు దుస్తుల పంపిణీ (గిఫ్ట్ ప్యాకేజీ)తోపాటు విందు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వెయ్యిమంది క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తారని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో క్రిస్టియన్ ఫ్రంట్ కార్యదర్శి టైటస్ రాజేందర్, బండ సునీల్, కన్నా, చిన్నరాజు, నాగభూషణం, ఏసుదాసు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వేరుశనగ క్వింటాల్ రూ.7,969

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ క్వింటాల్ గరిష్టంగా రూ.7,969, కనిష్టంగా రూ.7,381 ధర పలికింది. అదేవిధంగా ఆర్‌ఎన్ఆర్ రకం ధాన్యం క్వింటాల్ గరిష్టంగా రూ.3,289, కనిష్టంగా రూ.2,176, హంస రకానికి గరిష్టంగా రూ.2,168, కనిష్టంగా రూ.1,980, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,295, కనిష్టంగా రూ.2,293 చొప్పున వచ్చాయి.

కందులు క్వింటా రూ.11,160

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం తెల్ల కందులు క్వింటాకు గరిష్టం రూ.11,160, కనిష్టం రూ.9,969 ధరలు పలికాయి. అలాగే, ఎర్ర కందులు గరిష్టం రూ.10,976, కనిష్టం రూ.7,011, వడ్లు సోనా గరిష్టం రూ. 3,189, కనిష్టం రూ.2,360, వరి హంస గరిష్టం రూ. 2,711, కనిష్టం రూ. 2,001 ధరలు పలికాయి.

బీ అలర్ట్..



మళ్లీ కోవిడ్ కలకలం

- రాష్ట్రంలో జేఎన్–1 వేరియంట్ గుర్తింపు
- వైద్యారోగ్య శాఖ అధికారుల అప్రమత్తం
- మాస్క్ ధరించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపు
- జిల్లా ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డుల ఏర్పాటు
- ఆక్సిజన్, మందులు, ఇంజక్షన్ల కొరత లేకుండా చర్యలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రపంచవ్యాప్తంగా గడగడలాడించిన కోవిడ్ మహమ్మారి మరోసారి తరుముకొస్తోంది. రాష్ట్రంలో ఒమిక్రాన్ వేరియంట్‌కు చెందిన జేఎన్1 సబ్ వేరియంట్ కేసులు వెలుగుచూసిన నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. అనుమానం ఉన్న వారికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తీసుకోవాల్సిన చర్యలను సూచించింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కరోనా కేసులు లేవు. రానున్న రెండు, మూడు వారాల్లో పాజిటివ్ కేసులు పెరిగే అవకాశం ఉందనే అంచనాతో జిల్లా వైద్య శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక ఐసోలేషన్ వార్డు, ఐసీయూ..

ఉమ్మడి పాలమూరులోని నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, గద్వాల జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా కోవిడ్ ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఐసీయూ వార్డుతో పాటు కోవిడ్ నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ మేరకు ఆయా జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు ఫార్మసిస్టులు ఇతర వైద్య సిబ్బందితో సమావేశమై పీపీఈ కిట్లు, డిస్పోసబుల్ బెడ్ షీట్లు, మాస్కులు, శానిటైజర్లు, కోవిడ్ చికిత్సకు అవసరమైన మందులతో పాటు కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించి ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టుల కిట్లు స్టాక్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాల వారీగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో ఏర్పాట్లు ఇలా..

	మ.నగర్	నా.పేట	నా.కర్నూల్	జో.గద్వాల	వనపర్తి
ప్రత్యేక వార్డులో పడకలు	560	10	100	40	62
ఆక్సిజన్ సౌకర్యం ఉన్నవి	500	40	52	140	150
వెంటిలేటర్లు ఉన్నవి	60	4	37	10	24
లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంక్	2	1	1(పీఎస్ఏ)	1	-
ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు	47	50	-	7	4
బెడ్‌సైడ్ కాన్సంట్రేటర్లు	47	30	26	15	-



జనరల్ ఆస్పత్రిలో కోవిడ్ హెల్త్‌కేర్ సెంటర్

పీహెచ్‌సీల్లో సైతం..

జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాజాగా గురువారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు పీహెచ్‌సీల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టుల కిట్లు, కరోనా పాజిటివ్‌తో బాధపడుతున్న వారికి అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎక్కడా మందులు, ఇంజక్షన్ల కొరత లేకున్నా.. నిల్వ చేసుకునే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. ఈ మేరకు టీఎస్ఎంఎస్ ఐడీసీ నుంచి సమకూర్చుకునేలా జిల్లా వైద్యశాఖ అధికారులు ఆయా పీహెచ్‌సీల నుంచి ఇండెంట్లను తెప్పించుకుంటున్నారు.

ప్రతి బెడ్‌కూ ఆక్సిజన్..

కరోనా ఫస్ట్, సెకండ్ వేవ్‌లో రాష్ట్రంలో పలు ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా అధికారులు ముందస్తుగా జాగ్రతలు తీసుకున్నారు. అన్ని పడకలకు ఆక్సిజన్ సరఫరా అయ్యేలా ఇది వరకే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో రెండు (ఒకటి 13 వేల లీటర్లు, ఇంకోటి వెయ్యి లీటర్ల సామర్థ్యం గల) లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో 140 ఆక్సిజన్ సిలిండర్లు, గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో 500 ఎల్‌పీఎం సామర్థ్యం గల లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉంది.



జిల్లా జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు

అందుబాటులో ఉన్న ఆర్టీపీసీఆర్ కిట్లు జిల్లాల వారీగా ఇలా..

మహబూబ్‌నగర్ 521	నారాయణపేట 200
నాగర్‌కర్నూల్ 4,000	వనపర్తి 400
జోగులాంబ గద్వాల 500	

విధిగా మాస్కులు ధరించాలి..



ఇన్‌ఫ్లూయెంజా మాదిరిగా శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం, దగ్గు, జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి, తల నొప్పి లక్షణాలు కనిపిస్తే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రస్తుతం అయ్యప్ప దీక్ష సీజన్.. త్వరలో క్రిస్మస్, సంక్రాంతి పండగలు ఉన్నాయి. పిల్లలు, వృద్ధులతో పాటు అందరూ జాగ్రత్తగా ఉండాలి. విధిగా మాస్క్ ధరించాలి. సామాజిక దూరం పాటించాలి. కోవిడ్ చికిత్సకు అవసరమైన అన్ని వైద్య పరికరాలు, మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. ఐసీయూలో వెంటిలేటర్లు, ప్రతి బెడ్‌కు ఆక్సిజన్ సౌకర్యం ఉంది.

– డాక్టర్ జీవన్, సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ధరణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ధరణి జీఎల్ఎం, సక్సెషన్ దరఖాస్తులను నిశితంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హత ఉన్న దరఖాస్తులన్నింటికీ సంబంధిత ఎమ్మెల్యేల సమ్మతం తీసుకొని చెక్కుల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తులు 60 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఇండస్ట్రీయల్ కారిడార్లకు స్థలాలు గుర్తించాలని చెప్పారు. ఆధార్ అప్‌డేషన్ విషయంలో ప్రజలు ఆధార్ సెంటర్ల చుట్టూ తిరగకుండా అవగాహన కల్పించాలని, తక్షణమే ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం లేదన్న విషయాన్ని డీలర్ల ద్వారా వివరించాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని, తద్వారా వచ్చిన జరిమానాలను తక్షణమే డీడీల రూపంలో చెల్లించాలని ఆదేశించారు. ప్రజావాణి కింద వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. వివిధ రకాల ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా తహసీల్దార్ల వద్ద ఉన్న అన్ని రకాల ఫారాలను సోమవారం వరకు పరిష్కరించాలని కోరారు. శనివారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు ఎన్నికలపై శిక్షణ నిర్వహిస్తున్నందున తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. రెవెన్యూ సంబంధ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, హౌసింగ్ ఈఈ భాస్కర్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ రవినాయక్

కాసుల గలగల

- ఏడాదిలో 92,385 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్
- ప్రభుత్వానికి సమకూరిన రూ.241.53 కోట్ల ఆదాయం
- అత్యధికంగా జడ్చర్ల, అత్యల్పంగా అలంపూర్‌లో క్రయవిక్రయాలు
- ఉమ్మడి జిల్లాలో గతేడాది కంటే పెరిగిన రిజిస్ట్రేషన్లు

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్స్ శాఖ నుంచి ప్రభుత్వానికి ఆదాయం అధికంగా సమకూరుతుంది. కొంతమేర అన్నిరకాల రిజిస్ట్రేషన్లు తగ్గినా.. ఆదాయం మాత్రం అధికంగానే వస్తోంది. దీనికి తోడు రిజిస్ట్రేషన్ ఫీజులు సైతం పెరగడంతో స్టాంపులు– రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల పంట పండుతోంది. పెరిగిన రిజిస్ట్రేషన్ల ధరలతో ఆదాయం రెట్టింపు అయ్యింది. ఉమ్మడి జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధిక ఆదాయం జడ్చర్ల కార్యాలయం నుంచి వచ్చింది. జడ్చర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరగడంతోపాటు జాతీయ రహదారి, హైదరాబాద్‌కు దగ్గరలో, పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో అక్కడి భూములకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికితోడు ఏటా క్రయవిక్రయాలు అధికంగానే జరుగుతాయి. అతి తక్కువగా అలంపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో జరిగాయి. జడ్చర్లలో 15,376 రిజిస్ట్రేషన్స్ కాగా అలంపూర్‌లో 1,930 మాత్రమే అయ్యాయి.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ ఏడాది జనవరి నవంబర్ వరకు 92,385 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ అయితే వీటి వల్ల ప్రభుత్వానికి రూ.241.53 కోట్ల ఆదాయం సమకూరింది. అత్యధికంగా జడ్చర్ల పరిధిలో 15,376 డాక్యుమెంట్స్ ద్వారా రూ.57.59 కోట్లు, తక్కువగా అలంపూర్ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో 1,930 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ అయితే రూ.2.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో స్టాంపు విక్రయాల ద్వారా రూ.181.69 కోట్ల ఆదాయం, బదలాయింపు పన్ను ద్వారా రూ.22.33 కోట్లు, రిజిస్ట్రేషన్ సేవల ద్వారా రూ.37.50 కోట్ల ఆదాయం వచ్చింది.

జనవరి నుంచి నవంబర్ వరకు జరిగిన రిజిస్ట్రేషన్, ఆదాయం వివరాలు..

ప్రాంతం	రిజిస్ట్రేషన్లు	ఆదాయం (రూ.కోట్లలో)
జడ్చర్ల	15,376	57.59
వనపర్తి	14,950	35.36
మహబూబ్‌నగర్	13,773	55.60
గద్వాల	12,958	24.76
కల్వకుర్తి	7,961	19.25
నాగర్‌కర్నూల్	6,997	11.86
నారాయణపేట	6,935	16.11
అచ్చంపేట	3,448	4.52
కొల్లాపూర్	3,107	3.90
మక్తల్	2,563	6.80
ఆత్మకూర్	2,387	3.04
అలంపూర్	1,930	2.68



మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అకస్మాత్తుగా ఖాతాల్లో డబ్బులు జమ

- ఎవరు వేశారో తెలియక నేతన్నల ఆందోళన
- 168 మంది ఖాతాల్లో రూ.21,14,681లు జమ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వైనం

శాంతినగర్: చేనేత కార్మికుల ఖాతాల్లోకి అకస్మాత్తుగా డబ్బులు వచ్చి పడటంతో అటు ఆనందం వ్యక్తం చేయాలో లేక ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటామోనని ఆందోళన చెందుతున్నారు. రాజోళిలో 3,800 కుటుంబాలకు పైగా చేనేత మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం 1,100 మగ్గాలు ఉండగా.. మంగళవారం అకస్మాత్తుగా 168 మంది ఖాతాల్లో రూ.21,14,681లు జమ అయ్యాయి. అయితే ఈ డబ్బులు ఎవరు వేశారో తెలవకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అయింది. అదే సమయంలో గ్రామానికి చెందిన కొందరు మాస్టర్ వీవర్లు ఫోన్లు చేసి తామే డబ్బులు బదిలీ చేయించామని, 90 శాతం డబ్బులు తిరిగి తమ అకౌంట్లలోకి పంపాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చేనేత కార్మికులందరూ మాట్లాడుకుని సగం డబ్బులు తిరిగి పంపేందుకు ఒప్పుకుని కొందరు పంపగా.. మరికొందరు పంపలేదు. డబ్బులు పంపిన వారి ఖాతాల్లోకి తిరిగి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మళ్లీ జమయ్యాయి. అసలు డబ్బులు ఎందుకు పడుతున్నాయి.. ఎవరు పంపిస్తున్నారో తెలియక అయోమయానికి గురయ్యారు. అంతేగాక కొందరికి రూ.7 వేలు, మరికొందరికి రూ.15 వేలు, ఇంకొందరి ఖాతాల్లో రూ.25 వేల వరకు నగదు జమ కావడంతో చేనేత కార్మికులు ఆశ్చర్యపోతున్నారు. ఖాతాల్లోకి దాతలు వేశారా.. లేక సైబర్ నేరగాళ్లు లేక బ్లాక్‌మనీ ఉన్న వారు వేస్తున్నారా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఖాతాల్లో డబ్బులు పడటంపై రాజోళిలో చర్చించుకుంటున్న చేనేత కార్మికులు

కరోనా కాలంలో..

గతంలో కరోనా కాలంలో ఇతర రాష్ట్రాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు రాజోళి చేనేత కార్మికులు ఆర్థికంగా ఆదుకోవాలని కోరగా... ఇప్పుడు కార్మికుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేసి ఉంటారని కొందరు చెప్పుకుంటున్నారు. మాస్టర్ వీవర్స్ మాత్రం తామే అకౌంట్లలో డబ్బులు వేయించామని వాటిని తమకు పంపాలని ఒత్తిడి తెస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు. చేనేత జౌళి శాఖ అధికారులు మాత్రం దాతలు పంపి ఉంటారని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీస్, చేనేత జౌళిశాఖ అధికారులు స్పందించి చేనేత కార్మికుల ఖాతాల్లోకి డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో విచారించి.. 1,100 మంది చేనేత కార్మికులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



అండర్‌-17 ఉమ్మడి పాలమూరు జిల్లా సాఫ్ట్‌బాల్ జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా టోర్నీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బాల, బాలికల జట్లు గురువారం తరలివెళ్లాయి. హన్మకొండలో గురువారం ఈ నెల 24 వరకు జరిగే అండర్‌–17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు, నిర్మల్‌లో జరిగే అండర్‌–17 సాఫ్ట్‌బాల్ టోర్నీకి బాల, బాలికల జట్లు వెళ్లాయి. జిల్లాకేంద్రంలో ఉమ్మడి జిల్లాల జట్లను ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో పీఈటీలు పాల్గొన్నారు.

యువతకు వేదికలా.. యువజన సాంస్కృతిక పోటీలు

- నేటినుంచి మెయిన్ స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలు
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యువజన, క్రీడల శాఖ

మహబూబ్‌నగర్ క్రీడలు: యువజన, సాంస్కృతిక పోటీలు యువతకు వేదికలా ఉపయోగపడుతున్నాయి. యువత తమలోని నైపుణ్యాన్ని ఈ వేదిక ద్వారా ప్రదర్శిస్తున్నారు. జానపద కళలు, నృత్యాలు, పాటలతోపాటు తదితర మ్యూజికల్ అంశాల్లో ప్రతిభ చాటుతున్నారు. ప్రతి ఏడాది యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించి అందులో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. గతంలో జిల్లాకు చెందిన పలువురు రాష్ట్రస్థాయి యువజన సాంస్కృతిక పోటీల్లో ప్రతిభచాటారు.

మెయిన్ స్టేడియంలో..

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలోగల నూతన మల్టీపర్పస్ ఇండోర్‌లో శుక్రవారం జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం కానున్న పోటీలకు సంబంధిత శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో 15 నుంచి 29 ఏళ్ల యువతి, యువకులు పాల్గొనవచ్చు. వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది.



మెయిన్ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ

పలు అంశాల్లో పోటీలు

జానపద నృత్యం, జానపద గీతాలు (గ్రూప్ విభాగంలో 10కి మించి పురుషులు, మహిళలు, జానపద నృత్యం, గీతాల వ్యక్తిగత విభాగంలో ఐదుగురుకు మించకుండా పాల్గొనవచ్చు. అదేవిధంగా ఇంగ్లిష్‌లో వ్యాసరచన (60 నిమిషాల్లో), ఉపన్యాసం (3 నిమిషాలు), పోస్టర్ మేకింగ్, హిందీ, ఇంగ్లిష్‌లో ఉపన్యాసం, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తారు. యువ క్రిటి విభాగంలో హ్యాండ్‌క్రాఫ్ట్స్, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తుల కేటగిరీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచే వారిని ఎంపిక చేస్తారు.

విజయవంతం చేస్తాం..

జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలను విజయవంతంగా నిర్వహిస్తాం. ప్రతి ఏడాది జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించి ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తాం. ఆసక్తిగల యువత శుక్రవారం ఉదయం 10 గంటల వరకు మెయిన్ స్టేడియంలో తమ పేర్లు నమోదు చేసుకొని పోటీల్లో పాల్గొనవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, జిల్లా యువజన, క్రీడల అధికారి



చాంపియన్‌గా నిలిచిన అండర్‌-14 నెట్‌బాల్ బాలుర జట్టు



రన్నరప్‌గా నిలిచిన అండర్‌-17 జట్టు

నెట్‌బాల్‌లో మెరిసిన పాలమూరు

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం ముగిసిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 67వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలుర జట్లు అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకున్నాయి. అండర్‌-14 విభాగం రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర జట్టు చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో బాలుర జట్టు 14-3 పాయింట్ల తేడాతో ఖమ్మంపై విజయం సాధించింది. అండర్‌-17 విభాగంలో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఇరు జట్లను ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ అభినందించారు. భవిష్యత్‌లు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు

క్లుప్తంగా

ఉరేసుకొని వ్యక్తి మృతి

జడ్చర్ల: అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని నెక్కొండలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెక్కొండకు చెందిన శివయ్య(28) తెల్లవారుజామున నిద్రలేచి వ్యవసాయ పొలం దగ్గరకు వెళ్లి చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన మృతిపై భార్య మంజుల, బంధువులు అనుమానంతో ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్త ఆత్మహత్య చేసుకోలేదని, తనకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించేందుకు అంగీకరించకపోవడంతో సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. పోస్టుమార్టం నివేదిక మేరకు దర్యాప్తు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాద్వార్‌లో విషాదం

మక్తల్: కూతురి పుట్టినరోజు సందర్భంగా కేక్ తెచ్చేందుకు వెళ్లిన తండ్రి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం తీవ్ర విషాదం రేపింది. ఈ ఘటన మక్తల్ మండలం మాద్వార్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మాద్వార్‌కు చెందిన తుంగరాము (30) తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాత్రి కేక్ తెచ్చేందుకు అదే గ్రామానికి చెందిన రఘుతో కలిసి బైక్‌పై మక్తల్‌కు వెళ్లి వస్తుండగా.. గ్రామ సమీపంలో బొలెరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. తుంగ రాము మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య నవీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆచారి తెలిపారు.

మొసలి కలకలం



గట్టు: గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామశివారులో గురువారం మొసలి సంచారం కలకలం రేపింది. నెట్టెంపాడు కాల్వ సమీపంలోని రైతు పోతుల రామయ్య పొలంలో ఉన్న నీటిగుంతలో మొసలి కనిపించడంతో సమీప వ్యవసాయ పొలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులు, గొర్రెలు, చిన్న పిల్లలు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మొసలి బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

భూ తగాదాపై కేసు నమోదు

జడ్చర్ల: బూరెడ్డిపల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న భూమి విషయంలో బుధవారం జరిగిన దాడి ఘటనపై గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. బాధితుడు గూళ్ల సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివవరించారు. కాగా నిందితులు విచక్షణా రహితంగా కర్రలతో దాడులు చేశారని చర్యలు చేపట్టాలని బాధితుల తరఫున గ్రామస్తులు సీఐ కలిసి విజ్ఞప్తి చేశారు.

చికిత్స పొందుతూ బాలింత మృతి
పరిహారం చెల్లించాలని ఆందోళన



కొల్లాపూర్‌లోని ఆస్పత్రి ఎదుట గూమిగూడిన మృతురాలి బంధువులు

- కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యురాలితో వాగ్వాదం
- ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన వైద్యురాలు
- రాజీకుదిర్చిన మధ్యవర్తులు

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు నర్సింగ్ హోం వద్ద గురువారం కొందరు ఆందోళనకు దిగారు. బాలింత మృతికి మీ నిర్లక్ష్యమే కారణం అంటూ వైద్యురాలితో వాగ్వాదానికి దిగారు. ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్ వరకు చేరింది. చివరికి మధ్యవర్తులు రాజీ కుదిర్చారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకొత్తపల్లి మండలం యాపట్లకి చెందిన రజిత(21)కు ఏడాదిన్నర కిందట చారకొండ మండలం తుర్కలపల్లికి చెందిన సురేష్‌తో వివాహమైంది. రజిత గర్భిణి కావడంతో కొల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో ఈ నెల 3న ఆమెకు కాన్పు చేయించారు. సాధారణ కాన్పులో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. హెర్నియా సమస్య కారణంగా ఆమె ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రి వైద్యురాలు మహబూబ్‌నగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ కూడా ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగు పడకపోవడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఈ నెల 16న మృతిచెందింది. మృతురాలి కుటుంబీకులు కొందరు స్థానిక నాయకులతో కలిసి గురువారం సంబంధిత డాక్టర్ వద్దకు వెళ్లారు. రజిత అమ్మమ్మగారి ఊరు పెంట్లవెల్లి మండలంలోని మల్లేశ్వరం కావడంతో ఆ మండలానికి చెందిన హరిప్రసాద్, గోపినాయక్, తెలంగాణ దళితదండు నాయకులు బచ్చలకూర బాలరాజు మృతురాలి కుటుంబం తరఫున వైద్యురాలితో మాట్లాడారు. సరైన వైద్యం అందకపోవడంతోనే ఆమె మృతిచెందింది. ఆమె బిడ్డకు తల్లి లేకుండా పోయింది. ఆ కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో వైద్యురాలిపై కొందరు దురుసుగా మాట్లాడారు. దీంతో ఆమె వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లింది. పట్టణానికి చెందిన ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ఆమెకు సంఘీభావంగా స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో వైద్యురాలికి, మృతురాలి తరఫున వచ్చిన వారికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానిక నాయకులు కొందరు జోక్యం చేసుకుని ఇరువురి మధ్య రాజీ కుదిర్చారు. రూ.లక్ష పరిహారం చెల్లించేలా వైద్యురాలిని ఒప్పించినట్లు తెలిసింది. అయితే పరిహారం చెల్లింపు విషయంలో ఎటువంటి స్పష్టత రాలేదని, శుక్రవారం మరోసారి చర్చలు జరుపుతామని మృతురాలి తరఫు వారు తెలిపారు. ఈ ఘటనపై ఇరువర్గాలు తమకు ఎటువంటి ఫిర్యాదులు ఇవ్వలేదని ఏఎస్‌ఐ రామస్వామిగౌడ్ తెలియజేశారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచాలి



విద్యార్థులు తయారు చేసిన వాహనాన్ని పరిశీలిస్తున్న బృందం

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీ

కోస్గి: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించడంతో పాటు, పరిశోధనలపై ఆసక్తి పెంచి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరీ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో 'సృజన టెక్‌ఫెస్ట్‌-2023' పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రతి సంవత్సరం మెకానికల్ విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించే సృజన టెక్‌ఫెస్ట్‌-2023 కార్యక్రమాన్ని ఈ ఏడాది కోస్గి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించగా.. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, వడ్డేపల్లి, కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొని వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. ఆయా కళాశాలల విద్యార్థులు ఇచ్చిన ప్రాజెక్టుల్లో మహబూబ్‌నగర్ కళాశాల విద్యార్థులు ఇచ్చిన ఎలక్ట్రిక్ గో కార్ట్ ప్రదర్శన ప్రథమ బహుమతి పొందగా.. కోస్గి కళాశాల విద్యార్థులు ఇచ్చిన డ్యూయల్ ఆక్సిస్ స్టీరింగ్ మెకానిసమ్ ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల మెకానికల్ విభాగాధిపతి సత్యయ్య తెలిపారు. ప్రతిభ చూపిన ఈ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కాగా పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు కార్యక్రమానికి హాజరై విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ పరమేశ్వరీ ప్రశంసా పత్రంతో పాటు బహుమతులు అందజేశారు. ఇందులో ఆయా కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజ్ చేసినా.. మద్యం బార్ నిర్వహణ

జడ్చర్ల: ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసిన మద్యం బార్ యథావిధిగా కొనసాగడం జడ్చర్లలో చర్చనీయాంశంగా మారింది. 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఓ స్టార్ హోటల్లో నిర్వహిస్తున్న బార్ నుంచి గత నెల 15న ఎన్నికల సమయంలో నిబంధనలను ఉల్లంఘించి డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా మద్యం తరలిస్తుండగా జీఎస్టీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బార్‌లో ఉండాల్సిన మద్యం కాటన్లు ఎక్సైజ్ నిబంధనలకు విరుద్ధంగా బయటకు తరలించడంపై ఎక్సైజ్ అధికారులు విచారించి బార్‌ను సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారుల నిబంధనలను బేఖాతరు చేస్తూ బార్‌ను నిర్వాహకులు యథావిధిగా మద్యం విక్రయాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక విలేకరులు ఎక్సైజ్ సీఐ బాలాజీ దృష్టికి తీసుకెళ్లారు. తాము మద్యం బార్‌ను సీజ్ చేశామని, బార్‌ను మళ్లీ యథావిధిగా కొనసాగిస్తుండడంపై తమకు తెలిసిందన్నారు. మరోసారి విచారించి బార్‌ను సీజ్ చేస్తామని ఆయన తెలిపారు.

హాకీ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా గోటూరు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో గురువారం హాకీ తెలంగాణ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గోటూరు శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. శ్రీనివాస్‌గౌడ్ ప్రస్తుతం హాకీ మహబూబ్‌నగర్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. లాల్‌కోట జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. ఈయన ఎంపికపై వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, పీఈటీలు హర్షం వ్యక్తం చేశారు.

సృజనాత్మకత పెంపే లక్ష్యం

- రాష్ట్రస్థాయికి ఎంపికైన పెబ్బేర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



వనపర్తిటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని వారు ఎంచుకున్న సబ్జెక్టులో పెంపే లక్ష్యంగా సైన్స్‌ఫెయిర్ తరహా ప్రదర్శనలకు సాంకేతిక విద్యాశాఖ శ్రీకారం చుట్టిందని వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సాంకేతిక విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సుల విభాగాలకు చెందిన ఉమ్మడి కళాశాలల విద్యార్థులకు సృజన టెక్ ఫెస్ట్ పేరిట గురువారం పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, పెబ్బేరు(మహిళ కళాశాల) నుంచి ఒక్కొక్క ప్రాజెక్టుకు ఆరుగురు చొప్పున విద్యార్థులు నమూన ప్రదర్శనలు తీసుకొచ్చారు. ఈ నమూనా ప్రదర్శనలో పెబ్బేర్ కళాశాల విద్యార్థులు శబ్దం నుంచి విద్యుత్ తయారు చేసే ప్రాజెక్టు చేపట్టారు. ఈ ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను, ఆహుతులను విశేషంగా ఆకట్టుకోవడంతో ఉమ్మడి జిల్లా ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. న్యాయనిర్ణేతలు బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈ కార్తీక్‌రెడ్డి, జేపీఎన్‌సీఈ ఈసీఈ హెడ్ రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం..
పబ్బతి హనుమాన్



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

- మద్దిమడుగు క్షేత్రంలో నేటి నుంచి దీక్ష విరమణ ఉత్సవాలు
- 26న హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం



ప్రత్యేక అలంకరణలో పబ్బతి హనుమాన్

అమ్రాబాద్: తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటైన మద్దిమడుగులో దీక్షా మాల విరమణ ఉత్సవాలు శుక్రవారం నుంచి 26 వరకు వైభవంగా జరగనున్నాయి. ఇక్కడ వెలిసిన పబ్బతి ఆంజనేయ స్వామిని పిలిస్తే పలికే దైవంగా, కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు పూజిస్తారు. నల్లమల కొండల్లో ప్రకృతి రమణీయ ప్రదేశంలో వెలిసిన అంజన్న క్షేత్రం శ్రీశైలానికి ఉత్తర దిశగా ఉంటుంది. ఈ ఆలయానికి వేల ఏళ్ల చరిత్ర ఉందని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

మద్దిమడుగులో ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మాల విరమణ భక్తులకు ప్రత్యేకొష్టు ఏర్పాటు చేశారు. నీటి సమస్య లేకుండా (సింతటిక్) మినీ ట్యాంకులు ఉన్న స్నాన ఘట్టాలతో పాటు మరో 24 స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. పదరప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా నల్గొండ, హైదరాబాద్, ఏపీ తదితర ప్రాంతాల నుంచి మాల ధరించిన స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. ఈ నేపథ్యంలో మాచర్ల, దేవరకొండ, మిర్యాలగూడా, అచ్చంపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపనున్నారు.

ఏటా రెండుసార్లు ఉత్సవాలు

మద్దిమడుగు ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఏటా రెండు పర్యాయాలు జరుగుతాయి. కార్తీక మాసంలో దీక్షమాల విరమణ, చైత్రమాసంలో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయ స్వామి మాలను ధరిస్తారు. 40 రోజుల కఠోర దీక్ష అనంతరం ఇరుముడులతో ఆలయం వద్దకు వచ్చి స్వామివారికి సమర్పించి దీక్ష విరమణ చేస్తారు.


ఉత్సవాల వివరాలు..

- 22న ఉదయం నిత్యార్చన, విఘ్నేశ్వరపూజ పుణ్యాహవచనం, పంచగవ్యం, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ
- 23 విఘ్నేశ్వరపూజ, పంచగవ్యం, వాస్తుపూజ హోమం, రుద్రహోమం, సహస్రనామార్చన, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, నిత్యోపాసన, మన్యుసూక్తహోమం, తీర్థప్రసాద వితరణ, రాత్రికి అమ్మవారి సేవ
- 24న విఘ్నేశ్వరపూజ, గవ్యాంతపూజలు, రుద్రహోమం, నిత్యోపాసన, బలిహరణ, మహానివేదన, నీరాజన మంత్ర పుష్పములు, శివపార్వతుల కల్యాణం
- 25న విఘ్నేశ్వరపూజ, గవ్యాంతరపూజలు, రుద్రహోమం, నిత్యోపాసన, హనుమత్ వ్రతం, తీర్థ ప్రసాదవితరణ, సీతారాముల కల్యాణం
- 26న గవ్యాంతపూజలు, ఆంజనేయ స్వామికి 108 కలశాలతో అభిషేకం, హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ తెలిపారు.

గుట్టుగా గుప్తనిధుల తవ్వకాలు



లింగాల శివారులో గుప్త నిధులకు కోసం త్రవ్వకాలు జరిపి రాత్రికి రాత్రే చదును చేసిన ప్రదేశం



లింగాల శివారులోని పోచమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు(ఫైల్)

- కొనసాగుతున్న దేవతావిగ్రహాల ధ్వంసం
- గతంలో పోచమ్మ, నంది విగ్రహాలు ధ్వంసం
- నేడు లింగాల శివారులో మరో గుప్త నిధుల తవ్వకాలు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల పరిసర ప్రాంతాల్లో వివిధ దేవతామూర్తుల విగ్రహాల ధ్వంసం కొనసాగుతూనే ఉంది. లింగాలకు సమీపంలోని చాకిరేవుకుంట దగ్గర ఈ నెల 19న రాత్రి కొంతమంది గుర్తు తెలియని దుండగులు క్షుద్ర పూజలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. తవ్వకాలు చేసిన ప్రాంతంలో రాత్రికి రాత్రే జేసీబీతో చదును చేయిండంలో అనుమానాలకు తావిస్తోంది. 2022 మే 31 రాత్రి చెన్నంపల్లి వెళ్లే దారిలో శివాలయం ఎదుట ఉన్న నంది విగ్రహాన్ని ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనలో అప్పట్లో పదుల సంఖ్యలో అనుమానితులను విచారించినా పోలీసులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ధ్వంసం చేసి ఎత్తుకెళ్లిన నంది విగ్రహం ఎక్కడ ఉందో కూడా నేటికి తెలియలేదు. అప్పట్లో దాతలు ముందుకు వచ్చి నంది, శివలింగం విగ్రహాలను మళ్లీ పునఃప్రతిష్ఠించారు. ఇది జరిగి నెల రోజులకే 2022 జూలై 12 రాత్రి లింగాల శివారులో గ్రామ దేవత పోచమ్మ దేవాలయంలో పోచమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దేవాలయాలపై దుండగులు దాడులు చేసి విగ్రహాలను ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం ఎవరికి అంతుపట్టడం లేదు. గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తే మరి విగ్రహాలు ఎత్తుకెళ్లడం ఎందుకనే ప్రశ్నలు మొదలయ్యాయి. నల్లమల అటవీ ప్రాంతంలోని పలు చెంచు పెంటల్లో గుప్త నిధుల వేట గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతోంది. నల్లమల ప్రాంతంలో పూర్వకాలంలో రాజులు నిర్మించిన ఎన్నో దేవాలయాలు, కోటలు శిథిలావస్థకు చేరడం, గుప్త నిధుల తవ్వకాలకు నిలయంగా మారుతున్నాయి. ఈ సమయంలో పోలీసులు ఉదాసీనత వహిస్తుండడంతో గుళ్ల, గోపురాలకు భద్రత లేకుండా పోతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేల ఆరోగ్యానికి సేంద్రియ ఎరువులు

- పంట అవశేషాలతో తయారీ
- కోరమాండల్ ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ డా.సుబ్బారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న డా. జీవీ సుబ్బారెడ్డి

బిజినేపల్లి: వ్యవసాయ భూమిని బలంగా, ఆరోగ్యంగా తయారు చేసుకోవడానికి రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువులనే వినియోగించాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ ప్రసిడెంట్ డా. జీవీ సుబ్బారెడ్డి సూచించారు. పంటలోని అవశేషాలను, పంట కోత అవశేషాలను సరియైన పద్ధతిలో వినియోగించడంతో సేంద్రియ ఎరువులను తయారు చేసుకోవచ్చన్నారు. గురువారం పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్‌లో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా.పి రఘురామిరెడ్డి మాట్లాడారు. రైతులు భూసార పరీక్షలు నిర్వహించి అవసరమైన రసాయనిక ఎరువులను వినియోగించాలని, అధికారులు సూచించిన మో తాదులో వాడాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో నానో ఎరువులు అందుబాటులోకి వచ్చాయని, వాటిని ఆయా పంటల్లో ఆయా పద్ధతుల్లో వినియోగించాలన్నారు. రైతులు వ్యవసాయాన్ని వ్యాపార ధోరణిలో చూడాలని, అప్పుడే అధిక దిగుబడులు, లాభాలు వస్తాయన్నారు. ఆయా సాగు పంటలో కలుపు నివారణ పద్ధతులు వేర్వేరుగా ఉంటాయని, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు ఉపయోగించి నివారించాలన్నారు. పంటల సాగులో రైతులు శారీరక శ్రమను తగ్గించడానికి యాంత్రీకరణను ఎక్కువగా వినియోగించాలని, దీనిపై రైతులు మరింత అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పలు స్టాల్స్‌ను రైతులు పరిశీలించారు. రైతుసదస్సుకు విశ్వవిద్యాలయం డీన్ ఆఫైర్స్ డా.సత్యనారాయణ, పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డా.మల్లారెడ్డి, కేవీకే కో ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.పుష్పావతి, డీఏట చంద్రశేఖర్, కోరమాండల్ ప్రతినిధి డా.సుధాకర్, శాస్త్రవేత్తలు డా.కే. శ్రీధర్, డా.వాణిశ్రీ పాల్గొన్నారు.

'మత్స్య సహకార' సమరం



సొసైటీ సభ్యులకు ఎన్నికల నోటిఫికేషన్ పత్రాలను అందజేస్తున్న రఘునందన్‌రావు

- 31న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు
- నోటిఫికేషన్ విడుదల

కందనూలు: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నగారా మోగింది. ఈనెల 31న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖ పాత సొసైటీ కార్యాలయంలో కోఆపరేటివ్ ఎన్నికల జిల్లా అధికారి, ఆడిట్ ఆఫీసర్ రఘునందన్‌రావు అధ్యక్షతన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఎన్నికలు రెండు నెలల కిందట నిర్వహించాల్సి ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శితో పాటు 11 డైరెక్టర్ స్థానాలు ఉన్నట్లు తెలిపారు.

నోటిఫికేషన్ వివరాలు ఇలా..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా కమిటీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు 27న ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నామినేషన్ దాఖలు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ ఉపసంహరణ ఉంటుంది. 31న ఉదయం 8గంటల నుంచి ఎన్నికలు నిర్వహించి, సాయంత్రం ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లాలో 223 గ్రామాల మత్స్య సహకార సంఘాల సొసైటీ అధ్యక్షులు ఓటర్లుగా ఉండనున్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ప్రమోటర్ వాకిటి ఆంజనేయులు, ప్రమోటర్ తుమ్మల అల్లోజీ, గొడుగు సహదేవుడు, పెబ్బేటి నిరంజన్, పర్వతాలు, సత్యం, నాయకులు హరికృష్ణ, చాపల స్వామి, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ గణిత దినోత్సవ క్విజ్ పోటీలు

జడ్చర్ల టౌన్: శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని మండలంలోని పెద్ద ఆదిరాల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గణిత ఉపాధ్యాయులు అనురాధ, సంధ్య విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లయ్య రామానుజన్ గురించి విద్యార్థులకు వివరించారు.

విద్యాశాఖ కార్యదర్శిని కలిసిన వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యాశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బుర్రా వెంకటేషంను పాలమూరు యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ మర్యాదపూర్వకంగా గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పీయూ అభివృద్ధికి సహకరించాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



దేవరకద్ర: ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిని గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గతంలో తమతో పాటు న్యాయవాద వృత్తి నిర్వహించిన జీఎమ్మార్ ఎమ్మెల్యే కావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ముగిసిన శిక్షణ



గండేడ్: భవన నిర్మాణంలో నైపుణ్యం కలిగిన వారిగా కార్మికులుగా ప్రావీణ్యత సంపాదించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అల్తాఫ్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) అసిస్టెంట్ డైరెక్టర్ నిజలింగప్పలు పేర్కొన్నారు. సల్కర్‌పేట్‌లో మేస్త్రీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 15 రోజుల పాటు నిర్వహించిన ఈశిక్షణ గురువారం ముగిసింది. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



రాజాపూర్: రంగంబాయి తండాకు చెందిన శివ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. రంగారెడ్డిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న శివను గురువారం హెచ్‌ఎం రఘునందన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి



జడ్చర్ల టౌన్: విద్యార్థులు భవిష్యత్ కోసం ముందుగా లక్ష్యం నిర్దయించుకుని ప్రణాళికబద్ధంగా దానిని సాధించేందుకు కృషిచేయాలని సైకాలజిస్ట్ బూర్గుల రాధాకృష్ణరావు అన్నారు. గురువారం పట్టణంలోని బాదేపల్లి బాలుర హైస్కూల్‌లో పదో విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతిలో ఆయన పాల్గొని సందేశమిచ్చారు. విద్యార్థులు ఇష్టంగా చదివి లక్ష్యాలు చేరుకోవాలన్నారు. అమ్మానాన్నలు తలెత్తుకునేలా చేయాలన్నారు. హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సదరం దరఖాస్తుల కోసం పడిగాపులు

నర్వ: సదరం క్యాంప్ కోసం మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు తెలపడంతో అర్హులు గురువారం పడిగాపులు కాచారు. ఉదయం నుంచి మీ సేవల వద్ద వేచి చూడగా కేవలం 10నిమిషాలు మాత్రమే సైట్ ఓపెన్ అయిందని అర్హులైన దరఖాస్తుదారులు, మీ సేవ నిర్వాహకులు పేర్కొన్నారు. కేవలం ఇద్దరి దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, సాయంత్రం వరకు వేచి చూసిన సైట్ ఓపెన్ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రెండురోజుల పాటు అవకాశమివ్వాలని సైట్ ఓపెన్ కాకపోవడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించి మరొక్క అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోస్గి: లయన్స్‌క్లబ్ కోస్గిశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన శిబిరంలో నేత్ర వైద్యులు భాస్కర్‌గౌడ్ 60 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 35మందికి కంటిలో శుక్లాలు గుర్తించి వారిని పాలమూరు జిల్లా కేంద్రంలోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు.

కొంగు బంగారం.. కాళికాదేవి

- 23 నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- 29న ఎల్లమ్మ దేవత సిడే వేడుక
- ముస్తాబైన రామచంద్రాపురం



అలంకరణలో కాళికాదేవి అమ్మవారు



రామచంద్రాపూర్ ఊరగుట్టపై వెలసిన కాళికాదేవి దేవస్థానం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని రామచంద్రాపూర్ గ్రామ ఊరగుట్టపై వెలిసిన శ్రీకాళికాదేవి అమ్మవారు కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతుంది. ఇంతటి విశిష్టత గల అమ్మవారి బ్రహ్మోత్సవాలను ప్రతి సంవత్సరం అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 23 నుంచి 31వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఎల్లమ్మ దేవత సిడే కార్యక్రమాన్ని 29న నిర్వహించనున్నారు. గత 35 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన దివంగత కుర్వ మల్లయ్య ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతిఏడాది ఉత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా అమ్మవారి బ్రహ్మోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వారం రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఉత్సవాలు జరిగే ప్రతిరోజు అమ్మవారి సన్నిధిలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు.

విశేషోత్సవాలు..

కాళికాదేవి అమ్మవారి 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల మొదటి రోజు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. 24న తుల్జాభవాని ధ్వజారోహణం, 25న నాగదేవతా పూజలు, 26న అమ్మవారి రథోత్సవం, 27న గంగాదేవి బిందెసేవ, మహిశాసుర మర్దిని, 28న అమ్మవారికి బోనాలు, 29న ఎల్లమ్మ దేవతకు సిడే తిప్పుట, 30న భూలక్ష్మీదేవికి గొర్రె, మేకపోతులతో బండ్ల ఊరేగింపు, 31న అమ్మవారికి అమృత స్నానం పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం..



అమ్మవారి ఉత్సవాలను గత 35 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. మా నాన్న కుర్వ మల్లయ్య ఆధ్వర్యంలో దేవస్థానాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించారు. భక్తులు, గ్రామస్తుల సహకారంతో ఈ ఉత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వద్ద అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి అందరూ సహకరించాలి.

– ఆనంద్, ఉత్సవ నిర్వాహకులు

క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఒబేదుల్లా కొత్వాల్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని ధర్మ గ్రంథాల సారం ఒక్కటేనని అన్నారు. ఏసుక్రీస్తు సందేశాలను ఆచరించిన వారి జీవితాలు సుఖమయంగా గడుస్తాయని అన్నారు. బైబిల్ మానవజీవితానికి ఒక గైడ్ లాంటిదన్నారు. సేవాభావానికి అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చే క్రైస్తవ సమాజం ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్, మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు బెక్కరి అనిత, మీడియా కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు అజ్మత్‌అలీ, ఫహీం, నాగరాజు, ఖాదర్, సునీల్, చిన్నరాజు, కన్నా, నాగభూషణం, బాబిమియా తదితరులు పాల్గొన్నారు.

బీవీపీ కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న రమేష్‌చందర్

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతామని బీవీపీ పాలమూరుశాఖ అధ్యక్షుడు పుట్టి రమేష్‌చందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీవీపీ కార్యాలయంలో గురువారం భారత్ వికాస్ పరిషత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి మొదటివారంలో కళాశాల విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తామని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు స్వామి వివేకానందుని గురించి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు జనవరి 12న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు భూషణ్‌పాండే, వీఎస్‌ఆర్‌కే.ప్రసాద్, చంద్రుడు, ఎ.నారాయణరావు, యతిరాజాచారి, వెంకటేశ్వరగుప్త తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 17, 18 వార్డుల్లో గురువారం విద్యుత్ ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ చెన్నయ్యలతోపాటు ఇతర సిబ్బంది పర్యటించారు. రెండు వార్డుల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో కార్యక్రమం చేపట్టారు. కౌన్సిలర్ రహీమొద్దీన్, నాయకులు మినాజ్, ఖాజపాష, నర్సింహ్మాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో బీజేపీ నాయకుల నిరసన



జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

పాలమూరు: పార్లమెంట్ నుంచి బహిష్కరించబడిన కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలు ఉపరాష్ట్రపతిని అవహేళన చేస్తూ పార్లమెంట్ వెలుపల చేసిన విన్యాసాలను కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఫోన్‌లో వీడియో తీయడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాకుల బాలరాజు అన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ పాలమూరు బీజేపీ శాఖ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ చౌరస్తాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అదేవిధంగా వారి వ్యవహారం చూస్తుంటే పార్లమెంట్‌లో అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తులకు కాంగ్రెస్ పరోక్షంగా ప్రోత్సహిస్తున్నట్లు అనుమానం ఉందన్నారు. రాహుల్‌గాంధీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, నారాయణ యాదవ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు కుర్వకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నర్సింహ, ప్రసాద్, ఆంజనేయులు, పవన్, తిరుమలేష్, బాల్‌రాజ్, కేశవ్, విక్కీ, స్వామి నవీన్, మైబు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో బీజేపీ నిరసన..

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. రాజ్యాసభలో సభాపతిని అవమానించే విధంగా రాహుల్‌గాంధీ, ఇతర కాంగ్రెస్ ఎంపీలు వ్యవహరించారన్న నేపథ్యంలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, చంద్రశేఖర్, కృష్ణంరాజు, దేవన్న, నాగిరెడ్డి, రాజు, నరేష్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణత పెంచేందుకు కృషిచేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాజునాయక్

నవాబుపేట: ఉపాధ్యాయులు పదో విద్యార్థుల సిలబస్‌పై దృష్టి పెట్టి బోధన చేయాలని మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ సూచించారు. గురువారం ఆయన చౌడూర్ జెడ్పీస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల ఉత్తీర్ణత పెంచే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా చౌడూర్ పాఠశాలలో గత ఏడాది పది ఫలితాలు దారుణంగా వచ్చాయి. 42 మందికి గానూ కేవలం ఒకే ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

ముగ్గురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ



ఎల్లారెడ్డిపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్

కోయిల్‌కొండ: సమయపాలన, పాఠ్యప్రణాళికల విషయంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్ గురువారం మెమోలు జారీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలు, తండాల్లోని పాఠశాలలను మండల విద్యాధికారి గురువారం తనిఖీ చేశారు. కాగా వాల్యానాయక్ తండాలో మధ్యాహ్నం మూడు గంటలకే పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు వెళ్లడంతో మెమో జారీ చేయగా.. ఎల్లారెడ్డిపల్లి, రాజీవ్‌నగర్ తండాల్లో పాఠ్యాప్రణాళిక విషయంలో చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, ప్రణాళికతో బోధన చేయాలని సూచించారు. సీఆర్పీలు హర్షకుమార్, శంకర్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



దేవరకద్రలో వెంచర్ పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దేవరకద్ర: జిల్లా అదనపు కలెక్టర్ మోహన్‌రావు గురువారం దేవరకద్రలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దేవరకద్ర మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లపై ఆరాతీశారు. అనంతరం సివిల్ సప్లయ్ గోదాం తనిఖీ చేశారు. రాయిచూర్ రోడ్డులోని వెంచర్లను పరిశీలించారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు స్టాక్ పాయింట్ గోదాంలో నిల్వ ఉన్న పీడీఎస్, అంగన్‌వాడీ, పాఠశాలలకు సంబంధించిన బియ్యం స్టాక్‌ను తనిఖీ చేశారు. డీఎస్‌ఓ, ఇతర అధికారులు, తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ శివరాజు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ



చిన్నచింతకుంటలో..

చిన్నచింతకుంట: ప్రతి ఇంటికి అయోధ్య రాముడి అక్షింతలు చేరాలని.. అక్షింతల పంపిణీ సంఘ ప్రచారక్ సాయినాథ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో వివిధ గ్రామాల వారికి అక్షింతలు పంపిణీ చేశారు.

హన్వాడ: మండలకేంద్రంతో పాటు, వేపూర్ తదితర గ్రామాల్లో గురువారం అయోధ్యరాముడి అక్షింతల వితరణ జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.



వేపూర్‌లో ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

జీపీ ట్రాక్టర్ ట్రాలీ చోరీ: కేసు నమోదు

హన్వాడ: అయోధ్యనగర్ పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీని గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారు. ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 24న ట్రాలీ చోరీకి గురైంది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ గ్రామంలో వెతికారు. గురువారం పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. ఎన్నికల నిర్వహణ సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద మూత్రశాలల ఏర్పాటు కోసం అవసరమైన సామగ్రిని ట్రాలీలో తీసుకెళ్లామని.. ట్రాలీని అక్కడే ఉంచగా అదేరోజు గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారని తెలిపారు. గ్రామస్తులే అవసరాల కోసం తీసుకెళ్లారనే అనుమానంతో అందరినీ వాకబు చేశామన్నారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

పరామర్శ

గండేడ్: సల్కర్‌పేట్ కాంగ్రెస్ కార్యకర్త చిన్న చంద్రయ్య మృతిచెందడంతో బాధిత కుటుంబాన్ని మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆర్థికసాయం అందించారు. మాజీ సర్పంచ్ ఊశన్న, నర్సింహరెడ్డి, ఆనందం, రామకృష్ణ, ప్రశాంత్, మొగులయ్య, రఘు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంబడి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు గత కొన్ని రోజులుగా పనిచేయడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే మక్తల్ ప్రాంతంలో జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. ప్రజల ద్వారా చందాలు వసూలు చేసి మరి ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ఇలా నిరూపయోగకరంగా మారడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు జరుగుతున్న దొంగతనాలను దృష్టిలో పెట్టుకుని మాగనూర్ పోలీసులు వెంటనే సీసీ కెమెరాల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తండాల రోడ్ల దశ తిరిగేనా?

- ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెద్దగుంట్ల తండా రోడ్డు

మిడ్జిల్: మండలంలోని తండాలు గ్రామపంచాయతీలుగా మారినా.. వాటికి సంబంధించిన రోడ్ల విషయంలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో ఆయా తండాల్లోని గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పెద్దగుంట్ల తండా, ఈదుల బావితండా, మంగళగడ్డ, చేడ్ ఘాట్, నాయకుని తండా, చౌటకుంట, లింబ్యా, గొల్లనికుంట తండాలకు రోడ్డు సౌకర్యం సరిగా లేదని పలువురు వాపోతున్నారు. పదేళ్ల క్రితం మండలంలోని అన్ని తండాలకు కంకర రోడ్లు ఏర్పాటు చేశారని.. తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టలేదని చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బస్సుసౌకర్యం కూడా కలిగించే అవకాశం లేదని... దీంతో తమకు సమస్యలు తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో రాత్రివేళలో అత్యవసర సమయాల్లో కూడా కనీసం ఆటోలైనా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం, ఎమ్మెల్యేనైనా తమ తండాల రోడ్ల దశమార్చాలని, సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బంది పడుతున్నాం..



మా తండా నుంచి ఇతర ప్రాంతాలకు పోవాలంటే రోడ్డు సరిగా లేకపోవడంతో నిత్యం ఇబ్బంది పడుతున్నాం ఎన్ని వినతి పత్రాలు ఇచ్చినా ఎవరూ స్పందించలేదు. కనీసం నూతన ప్రభుత్వమైనా సమస్య పరిష్కరించాలి.

– సీతారాం, నాయకుని తండా

సమస్యలు పరిష్కరించండి



మండలంలో చాలా తండాలకు నేటికీ రోడ్డు సౌకర్యం లేదు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సులు, ప్రైవేటు వాహనాలు కూడా రావడం లేదు. నూతన ప్రభుత్వం తండాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్ల దశమార్చాలి.

– శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ పెద్ద గుంట్ల తండా

ఎన్నాళ్లీ కాలినడక..

- గ్రామాలకు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, ప్రజల ఆవేదన



కొండాపూర్‌కు బస్సులు లేక నడుచుకొంటూ వెళ్తున్న విద్యార్థులు

నవాబుపేట: మండలం పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నామని, కొన్నిసార్లు కాలినడకనే వెళ్లక తప్పడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులైతే తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్తున్నారు. గతంలో ఆయా గ్రామాలకు రహదారులు సరిగాలేవని అందుకే బస్సులు నడపడం లేదని అధికారులు చెప్పారని... తాజాగా రోడ్డు సౌకర్యం సరిగా ఉన్న గ్రామాలకు కూడా బస్సులు రావడం లేదని పలువురు వాపోతున్నారు. మండల పరిధిలో ప్రధానంగా కొండాపూర్, హజిలిలాపూర్, రేకుల చౌడాపూర్, లోకిరేవు, లింగంపల్లి, కిషన్‌గూడ, ఇప్పటూర్, కాకర్లపహడ్, సిద్దోటం గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా సందర్భాల్లో ఈ గ్రామాల్లో ఉండే ప్రజలు, విద్యార్థులు మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి తమ గ్రామాలకు బస్సులు నడపాలని ఎవరిని కోరిన పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో తమకు కాలినడక కష్టాలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఉన్న మహిళలు సైతం తమకు 'మహాలక్ష్మి' భాగ్యం కల్పించాలని కోరుతున్నారు. గ్రామాలకు బస్సులు నడిపితే తాము లబ్ధిపొందే అవకాశం ఉంటుందని అంటున్నారు.

అప్పట్లో రోడ్డు లేదన్నారు...



అప్పట్లో బస్సు కావాలని అడిగితే రోడ్డు లేదన్నారు. కానీ మా గ్రామానికి కొత్త రోడ్డు వేసి కూడా నాలుగేళ్లు అవుతోంది. అయినా బస్సు ఏర్పాటు చేయమంటే ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదు. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో గ్రామంలో ఉన్న మహిళలు సైతం బస్సు వేయించండి అంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికైనా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలి.

– బొజ్జమ్మ, కొండాపూర్, సర్పంచ్

4 కిలోమీటర్లు నడవాలి



బస్సు ఎక్కాలంటే 4 కిలో మీటర్ల దూరం నడవాల్సి వస్తోంది. లేదంట ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కానీవారు సైతం పరిమితికి మించి ప్రయాణికులను వాహనంలో ఎక్కిస్తున్నారు. బస్సు కావాలంటే మండల కేంద్రానికి రావాల్సిందే. బస్సులు లేకపోవడంతో చాలామంది తమ బైక్‌లపై పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లి వదులుతున్నారు. దీంతో కూలీ పనులకు సమయానికి వెళ్లలేకపోతున్నారు.

– పాండునాయక్, హజిలాపూర్ తండా

రోజూ నడక తప్పడం లేదు..

మూడు సంవత్సరాలుగా రోజు నడక తప్పటం లేదు. బస్సు సౌకర్యం లేకపోవడంతో నిత్యం ఎవరో ఒకరు లిఫ్ట్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం వస్తోంది. లేదంటే నడక తప్పదు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

– రఘురాం, విద్యార్థి, కామారం